# నిరోధానికి ముందు ర్యాలీ




**సమీక్ష** : గ్రీసుకు సహాయ ప్యాకేజీ ప్రకటన నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు గత వారం సానుకూలంగానే ముగిశాయి. అమెరికా బలహీన గణాంకాల నేపథ్యంలో మార్కెట్ ప్రతికూలంగా ఆరంభమైంది. అయితే తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లు మంగళవారం సూచీలు సానుకూలంగా కదిలేలా చేశాయి. గురువారం ఆహార ద్రవ్యోల్బణం కాస్త దిగివచ్చినా నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో సెన్సెక్స్ వారపు కనిష్ఠ స్థాయిని తాకింది. అయితే శుక్రవారం గ్రీసు ప్యాకేజీతో 18722 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల పనితీరు** } విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) రూ.307 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. మ్యూచువల్ ఫండ్‌లు కూడా రూ.53 కోట్ల నికర కొనుగోళ్లు చేయడం గమనార్హం.

**రంగాల వారీగా** } వస్త్రరంగం (ఎఫ్ఎమ్‌సీజీ) అత్యధికంగా లాభపడింది. అంతక్రితం వారం నష్టాల పాలైన ఐటీ సూచీలో తక్కువ స్థాయిలో కొనుగోళ్లు కనిపించాయి. అంతర్జాతీయ కమోడిటీ ధరలు పుంజుకోవడంతో లోహ షేర్లలో ర్యాలీ కనిపించింది. మన్నికైన వినిమయ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ, వాహన సూచీల్లో లాభాల స్వీకరణ జరిగింది. శుక్రవారానికల్లా లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం కొనుగోళ్లపై ఆసక్తి పెరిగినట్లు సూచిస్తోంది.

**భవిష్యత్ అంచనా** } సెన్సెక్స్‌కు ప్రస్తుతం 200 రోజుల చలన సగటు(డీఎమ్ఏ)గా ఉన్న 19050 స్థాయి నిరోధంగా కొనసాగగలదు. ఈ స్థాయి కంటే పైన ముగిస్తేనే మార్కెట్ స్వల్పకాలంలో ఊర్ధ్వముఖ ధోరణిలోకి ప్రవేశించవచ్చు. మరో పక్క 60 రోజుల డీఎమ్ఏ స్థాయి అయిన 18382 తక్షణ మద్దతు స్థాయిగా ఉంటుంది. ఈ స్థాయి కంటే దిగువన మార్కెట్ ముగిస్తే స్వల్పకాలంలో సెన్సెక్స్ అధోముఖ ధోరణిలో ఉన్నట్లు లెక్క. అంతే కాదు ఈ బలహీనతలు కొనసాగే అవకాశాలూ ఉంటాయి.

**ప్రభావిత అంశాలు** } రేపు(జులై 26) జరగనున్న రిజర్వు బ్యాంకు పరపతి సమీక్షను మార్కెట్లు సునిశితంగా పరిశీలిస్తాయి. ఎఫ్ఐఐల ధోరణి, రుతుపవనాల్లో ప్రగతి సానుకూలంగా ఉండొచ్చు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో చలనాలను అంచనా వేయొచ్చు. గురువారంతో పూర్తికానున్న ఎఫ్ & ఓల కాంట్రాక్టు గడువు ఊగిసలాటను పెంచనుంది.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18449, 18258, 18065; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18936, 19050, 19254

**మార్కెట్లు ఏదైనా నిరోధాన్ని ఎదుర్కొనే ముందు ర్యాలీ చోటుచేసుకోవచ్చని అంచనా.**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*